నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | సెప్టెంబర్ 07, 2024 | www.navatelangana.com

పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2024-25వ విద్యా సంవత్సరానికి గాను మైనారిటీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ (ఉపకార వేతనములు) లకు దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబర్ 31 చివరి తేది అని, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారిణి కె. కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ అన్నికళాశాలలో చదువుతున్నటువంటి మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు కాలేజీలలో ఆన్ లైన్ స్కాలర్ షిప్ దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 01 నుండి డిసెంబర్ 31 వరకు గడువు కలదు అని పేర్కొన్నారు. ఫ్రెష్, రెన్యువల్ స్కాలర్ షిప్ పొందుటకు దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఈ పస్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ http://telanganaepass.cgg.gov.in లో తమ దరఖాస్తులు పూర్తిచేసుకోవాలని సూచించారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరాలు

నవతెలంగాణ-రామారెడ్డి



మండల కేంద్రంలో జరిగిన దొంగతనాన్ని సీసీ కెమెరా పట్టించాయి. మండల కేంద్రానికి చెందిన కొట్టే నర్సింలు గత నెల 31వ తేదీ ఇంటికి తాళం వేసి రాజంపేటకు వెళ్ళగా, అదే అదనుగా చూసి ఇంటికి కన్నం వేసి, అలమారిలో గల వెండి, బంగారు నగలను దొంగిలించ గా, పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించగా కన్నాపూర్ తండాకు చెందిన కాట్రోత్ మైపాల్‌ను పట్టుకొని విచారించి, దొంగిలించిన వెండి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. మహిపాల్ ను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై నరేష్, ఏ ఎస్ ఐ లచ్చిరాం, హెడ్ కానిస్టేబుల్ దేవా గౌడ్, సిబ్బంది సాయిలు, పవన్, రమేష్ లు కేసును చేదించినట్లు తెలిపారు.

విధేయతకు పట్టం

టీపీసీసీ అధ్యక్షులుగా బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్

- ఎట్టకేలకు ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం
- మరోసారి జిల్లాను వరించిన పీసీసీ పదవి

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

తెలంగాణ పీసీసీ అధ్యక్షులుగా ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది. పీసీసీ పదవి కోసం పార్టీలో గట్టి పోటీ నెలకొనగా గత కొద్దిరోజులుగా కొనసాగిన తర్జనభర్జనల మధ్య.. అంతిమంగా మహేశ్‌కుమార్‌గౌడ్ వైపే అధిష్టానం మొగ్గు చూపింది. ఆయనకు పదవి అప్పగించడంతో నిజామాబాద్ జిల్లాకు చెందిన నాయకుడికి పీసీసీ పదవి వరించడం రెండోసారి అవుతుంది. గతంలో డీ.శ్రీనివాస్ ఆ పదవి చేపట్టారు.

బాల్కొండ నియోజకవర్గంలోని భీంగల్ మండలం రహత్‌నగర్‌కు చెందిన మహేష్ కుమార్ గౌడ్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న ఆయన గిరి రాజ్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న క్రమంలో 1986 లో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఎన్ఎస్‌యుఐ నాయకులుగా రాజకీయ ప్రవేశం చేసిన మహేష్ కుమార్ గౌడ్.. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీలో అనేక పదువులు చేపట్టారు. 90వ దశకంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవి చేపట్టారు. తదనంతరం 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న వయసులోనే డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తదనంతరం 2013 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2014లో నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలో నిలిచి ఓడిపోయారు. ఎంతో కష్ట పడే తత్వం కలిగిన ఆయన నిరంతరం పార్టీ కోసం పనిచేస్తూ ఎల్లప్పుడూ కార్యకర్తలు అందుబాటులో ఉండటంతో తొలుత పిసిసి కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, పిసిసి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.


బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్

2021 జూన్ 26న మహేశ్‌కుమార్‌గౌడ్ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడయ్యారు. తరువాత 10 డిసెంబర్ 2022న టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితునిగా కొనసాగారు. పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేయడంలో మహేష్ కుమార్ గౌడ్ కీలక పాత్ర పోషించారు. పార్టీ సూచన మేరకు 2023 శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ సీటుకును త్యాగం చేశారు. కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి బరిలో నిలవగా.. షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలో నిలిచారు. దీంతో ఆయన త్యాగం గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం.. అధికారంలోకి రాగానే 2024 జనవరి 22న ఎమ్మెల్యేల కోట కింద శాసనమండలి సభ్యులుగా(ఎమ్మెల్సీ)గా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.


ధర్పల్లిలో స్వీట్లు పంచిపెట్టుకుంటూ సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

బొమ్మమహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేపట్టారు. శుక్రవారం బాల్కొండ, ధర్పల్లి, ముప్కాల్ తదితర మండలాల్లో టపాసులు పేలుస్తూ స్వీట్లు పంచుకుంటూ హర్షం వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకులు : మానాలమోహన్‌రెడ్డి

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించినందుకు ఆయనకు శుభాకాంక్షలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలియజేశారు. ఎన్ ఎస్ యు ఐ నాయకులుగా ప్రారంభించి జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులుగా ఎంతో కష్టపడి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మహేష్ కుమార్ గౌడ్ ఎంతో కష్ట పడే తత్వం కలిగిన వ్యక్తి అని అన్నారు. నిరంతరం పార్టీ కోసం పనిచేస్తూ ఎల్లప్పుడూ కార్యకర్తలు అందుబాటులో వుండే నాయకులు మహేష్ కుమార్ గౌడ్ కి పీసీసీ అధ్యక్షుడు పదవి రావడం సంతోషంగా వుందని, కష్టపడే వారికి గుర్తింపు వుంటుంది అనే వారికి ఇది నిదర్శనం అని అన్నారు.


వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న పలువురు యువకులు

గణేశ్ జి ఆగమనం..

- నేడు వినాయక చవితి
- పెద్దఎత్తున ఉత్సవాలకు సిద్ధమైన ఉమ్మడి జిల్లా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గణేశ్ ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. కాగా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్నా నుంచి పెద్ద వరకు తమ తమ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మండపాలను సిద్ధం చేసుకోగా.. నేడు గణపత్రి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేయనున్నారు. కాగా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఇది వరకు జిల్లా అధికార యంత్రాంగం శాంతికమిటీ సమావేశాలను నిర్వహించింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. అయితే మట్టి గణపతి ప్రతిమల ఏర్పాటుపై ఈసారి అవగాహన అంతంత మాత్రంగానే నిర్వహించారు.

నిజామాబాద్ జిల్లాలో గణపతి విగ్రహాల విక్రయాలు పెద్దఎత్తున జరిగాయి. నగరంలోని కంఠేశ్వర్, పెద్ద బజార్ రోడ్డుతో పాటు పలుచోట్ల వినాయక విగ్రహాలను విక్రయాలు చేపట్టారు. గతేడాదితో పోలిస్తే ధరలు పెరిగాయి. సుమారు 20 శాతం నుంచి 30 శాతం మేర ధరలు పెరిగినట్టు విక్రయదారులు పేర్కొంటున్నారు. 9 నుంచి 11 రోజుల పాటు పూజలందుకోనున్న గణపతి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది.



పూజ సామగ్రి కొనుగోలు

కాగా గణపతి పూజ సామగ్రి కొనుగోలుదారులతో ఆర్ఆర్ చౌరస్తా నుంచి పెద్దబజార్ మీదుగా గాంధీ చౌక్ వరకు రోడ్డు కిక్కిరిసింది. నేడు మరింత పెద్దఎత్తున వచ్చి కొనుగోలు చేయనున్నారు. కాగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసులు దారి మళ్లింపు చర్యలు చేపట్టారు.

రక్షిత మృతిపై విచారణ జరిపి న్యాయం చేయండి

- రక్షిత తండ్రి జిల్లా కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


వినతిపత్రం అందజేస్తున్న తండ్రి, విద్యార్థి సంఘాల నాయకులు

'రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ లో మొదటి సంవత్సరం చదువుతున్న మా కూతురు రక్షిత మృతిపై సమగ్ర విచారణ జరపాలని' రక్షిత తండ్రి విష్ణు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కోరారు. రక్షితకు న్యాయం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, ఏఎస్ఎఫ్ఐ, పీవైఎల్, ధర్మసమాజ్ పార్టీలతో కలిసి రక్షిత తండ్రి విష్ణు జిల్లా కలెక్టర్ గారికి నిజామాబాద్ నగరంలో కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న రక్షితను మూడు రోజుల క్రితమే హాస్టల్ లో జాయిన్ చేశానని, శనివారం రోజున ఉదయం హాస్టల్‌లో చనిపోయిందని, కళాశాల ప్రిన్సిపల్ మేము వచ్చేదాకా ఆపకుండా బోధన్ ఆసుపత్రికి తరలించరని, హాస్టల్లో సీసీ కెమెరాలు చూపించలేదని తెలిపారు. విద్యార్థులకు పాఠాలు చెప్పే అనేకమంది మహిళా లెక్చరర్స్ ఉండగా పురుషులనే ఎందుకు వార్డెన్ గా నియమించారని, లోపల ఏం జరిగిందో విషయాలను బయట చెప్పకుండా మొదటి సంవత్సరం విద్యార్థులను అదే రోజు ఇంటికి పంపించడం మరిన్ని అనుమానాలకు దారితీసిందని తెలిపారు. కావున విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మా కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి, దర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్, విద్యార్థి సంఘల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


గోదాంలో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న కలెక్టర్

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, సీ.సీ టీ.వీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును కొనసాగిస్తుండడాన్ని గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

అమెరికా చేరుకున్న జుక్కల్ ఎమ్మెల్యే

నతెలంగాణ- నిజాంసాగర్

గ్రీట్ అండ్ మీట్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో విద్యార్థులకు లెక్చర్ ఇవ్వడానికి బయలుదేరిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర రాజధాని అయినటువంటి ఆస్టిన్ నగరానికి శుక్రవారం ఎమ్మెల్యే చేరుకున్నారు. ఎమ్మెల్యేకు మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన ఎన్నారై భాస్కర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ఎన్నారై

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏవో కి ఆశ వర్కర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మెయిల్ పెట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. 'తగిన ఆర్థిక కేటాయింపులతో ఎన్‌హెచ్ఎం స్కీంను కేంద్ర ప్రభుత్వం శాశ్వత ఆరోగ్య స్కీం మార్చాలి. 45, 46వ ఐఎల్సి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులు అమలు చేయాలి. ఆశాలను కార్మికులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.26,000/-లు చెల్లించాలి. పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్‌తో సహా అన్ని సామాజిక భద్రత ప్రయోజనాలకు నెలకు రూ.10,000/-ల కంటే తక్కువ కాకుండా చెల్లించాలి. అన్నిరకాల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి. ఆశాలకు పని భారం తగ్గించాలి. పారితోషికం లేని పనులు చేయించకూడదు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ వర్తింపజేస్తూ ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును స్కీం వర్కర్లలో భాగమైన ఆశాలకు వర్తింపచేయాలి. 6 నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలి. 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలి.మెడికల్ సెలవుల కోసం ఖచ్చితమైన నిబంధనలు రూపొందించాలి. ఆరోగ్యం (ఆసుపత్రులతో సహా) వంటి అన్ని ప్రాథమిక సేవల ప్రైవేటీకరణ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి. లేబర్ కోడ్స్‌ను ఉపసహరించుకోవాలి. ఆశాలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని' డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఆశాలు

ఆస్పత్రిలో కుప్పకూలిన సీలింగ్

- సాలూర పీహెచ్‌సీలో ఘటన

నవతెలంగాణ-బోధన్


సీలింగ్ కూలిన గది

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం రాత్రి ఆరున్నర గంటల ప్రాంతంలో రోగుల వార్డులో గల పీవోపీ సీలింగ్ కుప్పకూలింది. ఆ సమయంలో రోగులు ఎవరూ లేకపోవడం వలన పెను ప్రమాదం తప్పినట్లు అయింది. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జయప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం గత నాలుగు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు ఆసుపత్రి గదిలలో గోడలు నీటిచెమ్మ వచ్చి ప్రమాదకరంగా మారాయని, దాంతో రోగుల గదిలో సీలింగ్ తడిసిపోయి పూర్తిగా పడిపోయిందని అన్నారు. ఒక్కసారిగా పెళ్లున శబ్దం రావడంతో తాను చూశానని ఆ గదిలో ఉన్న మొత్తం పిఓపి సీలింగ్ కూలిపోయిందని అన్నారు. ఆ సమయంలో బెడ్ పై రోగులు లేరని దాంతో ప్రమాదం తప్పినట్లు అయిందన్నారు. తక్షణమే సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేసినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న బోధన్ డివిజన్ ఉపవైద్యాధికారి డాక్టర్ రాజు శుక్రవారం సాలుర పిహెచ్‌సీని సందర్శించి ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. రోగుల గదిలో సీలింగ్ కూలిన దృశ్యాలను సెల్ ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు చేరవేశారు. అలాగే ఆపరేషన్ థియేటర్, స్టోర్ రూమ్, కంప్యూటర్ గదిలో సీలింగ్ తడిసిపోయి పలుచోట్ల పెచ్చులు ఉండడాన్ని ఆయన పరిశీలించారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిన విషయాలను ఆయన ఉన్నతాధికారులకు నివేదించారు.

గత 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆసుపత్రి భవనం గతంలోనే శిథిలావస్థకు చేరడంతో భవనాన్ని మరమ్మత్తులలో భాగంగా అన్ని గదులలో, వరండాలో సీలింగ్ పీఓపీ పనులు చేపట్టారు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు పిఓపి పూర్తిగా తడిచిపోయి కుప్పకూలింది. దాంతో ఆసుపత్రికి వస్తున్న రోగులను లోపలికి అనుమతించడం లేదు. పక్కనే ఉన్న భవనంలో రోగులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపవైద్యాధికారి డాక్టర్ రాజు మాట్లాడుతూ పిహెచ్సిలో పిఓపి సీలింగ్ పూర్తిగా కూలిపోయిందని, ఆయా గదులలో వర్షపు నీటితో గోడలు తడిసిపోయి ప్రమాదకరంగా మారాయిని ఈ విషయాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.

వదినను హత్యచేసిన మరిది

- భాగిర్థిపల్లి గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత

నవతెలంగాణ-భిక్కనూర్

తండ్రి అనారోగ్యానికి గురి కాగా.. ఆస్పత్రిలో చూపించేందుకు డబ్బుల కోసం తమకున్న భూమిని విక్రయించేందుకు అడ్డువస్తుందని వదినను మరిది హత్య చేసిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం భాగిర్థిపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. కాగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు మృతదేహంతో ఆందోళన చేపట్టడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోచయ్యకు రాములు, సురేష్ ఇద్దరు కుమారులు. పోచయ్యకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఈ మధ్యకాలంలో పోచయ్య అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం డబ్బుల విషయంలో రాములు భార్య లావణ్య(40) అలియాస్ యేసు మనిని, మరిది సురేష్ మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. భూమి అమ్మడానికి నిరాకరిస్తుందన్న కక్షతో శుక్రవారం తెల్లవారుజామున ఇంటి పనులు చేస్తున్న వదినను వెనుక నుండి కత్తితో మెడ పై, వీపు భాగంలో దాడి చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే లావణ్య బంధువులు అత్తమామలపై దాడి చేసే ప్రయత్నం చేశారు. న్యాయం కోసం బంధువులు ఆందోళన చేపట్టగా సద్దుమణగకపోవడంతో రాజంపేట్, బిబిపేట్, బిక్కనూర్, దోమకొండ, స్పెషల్ పార్టీ పోలీసులు రంగంలోకి దిగారు. మృతురాలు లావణ్య కుమారుడు, భర్తకు న్యాయం చేస్తామని పోలీసులు లావణ్య బంధువులకు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి సురేష్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్ తెలిపారు. తండ్రి పోచయ్య పై ఉన్న నాలుగు ఎకరాల భూమిని మృతురాలు లావణ్య కుమారుడి పేరు పై చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన రీల్స్ సరదా

పాము కాటుకు యువకుడు మృతి

నవతెలంగాణ-బాన్సువాడ(నసూరుల్లాబాద్)



రీల్స్ చేసేందుకు పాముతో విన్యాసాలు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు పాముకాటుతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని దేశాయి పేట్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేశాయిపేట్ గ్రామానికి చెందిన మోచి శివరాజులు(23) తన తండ్రితో కలిసి గ్రామంలో పాములు పడుతుండేవాడు. పాముతో రీల్ చేసేందుకు నోట్లో పెట్టుకోగా.. పాము కాటు వేసింది. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

వివరాలు మెయిన్‌లో..

డెంగ్యూతో విద్యార్థిని మృతి

నవతెలంగాణ-బిచ్కుంద



డెంగ్యూతో విద్యార్థిని మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బిచ్కుంద మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 9వ తరగతి విద్యాభ్యాసం చేస్తున్న మండల కేంద్రానికి చెందిన చాప్ట సిద్దేశ్వరి (13) డెంగ్యూ వ్యాధితో మృతి చెందింది. చాప్ట సిద్దేశ్వరి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆరో తరగతి నుండి విద్యాభ్యాసం చేస్తున్నారు.

వివరాలు మెయిన్‌లో..

ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష

- మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేసినందుకు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఓ వ్యక్తి మద్యం మత్తులో 100 కు డయల్ చేయగా శుక్రవారం జిల్లా రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు నాలుగవ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. నగరంలోని 4 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మ గుట్టకు చెందిన ఆఫ్రోజ్ (32) అనే వ్యక్తి మద్యం మత్తులో అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన డయల్ 100 నెంబర్‌కు కాల్ చేస్తూ న్యూసెన్స్ చేశాడు. ఈ మేరకు వ్యక్తిని శుక్రవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా విచారించిన మెజిస్ట్రేట్ అఫ్రోజ్‌కు మూడు రోజులు జైలు శిక్ష విధించారు. అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన డయల్ 100 నంబర్ ను దుర్వినియోగం చేయకుండా ఆపదలో ఉన్నవారికి సహాయ పడే విధంగా ప్రతి ఒక్కరూ పోలీసు వారికి సహకరించాలని అన్నారు. అనవసరంగా పోలీసు వారిని ఇబ్బంది పెట్టాలని చేసినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

అర్గుల్‌లో వారసంత ప్రారంభం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామంలో వార సంతను శుక్రవారం మాజీ సర్పంచ్ గొర్తే రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రజలు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు వారసంతలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు



వారసంత ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

సరైన ఓటరు జాబితా సిద్ధం చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా జరుగుతున్న ఓటర్ లిస్ట్ తయారీ, 2025 బూత్ లెవెల్‌లో అధికారులు చేస్తున్న సర్వేను శుక్రవారం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని యువతను కోరారు. షిఫ్ట్ అయినవారు మరణించిన ఓటర్ల వివరాలు అందజేసి, సరియైన ఓటర్ల జాబితా తయారికి సహకరించాల్సిందిగా కమిషనర్ కోరారు. సర్వేలో భాగంగా పక్కాగా ప్రతి ఒక్కటి పరిశీలించి ఓటర్ లిస్టు తయారీలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్వే సిబ్బందితో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ప్రాథమిక శిక్షణ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇటీవల ఇంటిపన్నుల విధింపు, వసూలు కోసం రెవెన్యూ విభాగంలో ఇటీవల నూతనంగా నియామకం అయిన బిల్ కలెక్టర్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ప్రాథమిక శిక్షణ మున్సిపల్ సంచాలక కార్యాలయం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ విధానంలో కమిషనర్ మకరంద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సిబ్బంది నియమ నిబంధనల ప్రకారం పనులు చేయాల్సిందేనని క్లుప్తంగా వివరించారు. ప్రజలకు సైతం విధి విధానాలను తెలియజేయాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంచాలక కార్యాలయం నుండి సంయుక్త సంచాలకులు, సిబ్బంది ఇషాక్, నగరపాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్ నజీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మకరంద్

9వ డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ పర్యటన...

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 49వ డివిజన్‌లో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఫిక్చర్ ప్యాలెస్ ఏరియాలో ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. నేటి నుండి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి గణేష్ నిమజ్జనం రూట్లు పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తనవంతుగా సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. కార్ర్యమంలో కార్పొరేటర్ మెట్టు విజయ్, ట్రాఫిక్ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ సమస్యలపై ఫిర్యాదుల సవరణ

- ప్రత్యేక అధికారులను నియమించిన వ్యవసాయ శాఖ

నవతెలంగాణ - భీంగల్‌రూరల్

మండలాల వారీగా అధికారులు రైతు రుణమాఫీ ప్రక్రియలో రైతుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు భీంగల్ మండలంలోని గ్రామ గ్రామానికి అధికారులు వెళ్లి రుణం మాఫీ కానీ రైతు వివరాలను తనిఖీ చేసి, సమస్య పరిష్కరించే విధంగా ఆన్లైన్ ద్వారా సరి చేస్తున్నారు. శుక్రవారం జాగిర్యాల గ్రామనికి ఏఇఓ ఎమ్, దివ్య రైతు రుణం తీసుకొని రుణమాఫీ కానీ రైతుల వివరాలను ఆన్లైన్ ద్వారా చెక్ చేసి ఎందుకు రుణమాఫీ కాలేదో రైతులకు వివరించారు. కొన్ని తప్పులవల్ల రైతు రుణమాఫీ పెండింగ్‌లో ఉందని తెలిపారు రుణం తీసుకున్న వ్యక్తి రేషన్ కార్డులో లేనియెడల రుణం తీసుకున్న రైతును వారి కుటుంబ సభ్యులతో ఫోటో తీసుకుని అప్లోడ్ చేశారు. రైతు రుణమాఫీకి సంబంధించి కుటుంబాలను గ్రూపుగా నిర్ధారణ చేశారు. అనంతరం రైతు ధ్రువీకరణ పత్రవం అలాగే వారి కుటుంబ సభ్యుల ఫోటో తీసుకొని అప్లోడ్ చేశారు.



ఫిర్యాదులను సవరిస్తున్న అధికారి

యువతకు ఆదర్శం హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్

- ఎస్ఐ యల్ రాము



ఎస్ఐని కలిసిన హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండలనికి నూతనంగా వచ్చిన ఎస్ఐ యల్.రాము ని హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ఫౌండేషన్ జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ్ ఫౌండేషన్ వారు చేసే కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉచిత పుస్తకాల పంపిణీ, ఉచిత వైద్యశిబిరాలు, ప్రాణహాని స్థితిలో ఉన్న వారికి రక్తదాన శిబిరాలు, అనుకోకుండా సంభవించిన పరిణామాల వల్ల ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అందించే చేయూత చాలా గొప్పదని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో నా వంతు సహాయం కూడా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ మెంబర్స్ రాజేందర్, జీవన్, నవీన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉషు పోటీలకు కేర్ డిగ్రీ కళాశాల విద్యార్థి

- రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిన షేక్ బిలాల్



షేక్ బిలాల్‌ను సన్మానిస్తున్న కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేర్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మూడవ సంవత్సరం చదువుతున్న షేక్ బిలాల్ అనే విద్యార్థి మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడని కేర్ కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బంగారు పతకం సాధించిన విద్యార్థి షేక్ బిలాల్‌ను సన్మానం చేసి అభినందించిన కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్. నిజామాబాద్‌లో ఉషూ క్రీడను ప్రోత్సహిస్తు క్రీడాకారులకు ఉత్తమమైన కోచింగ్ ఇస్తున్న కోచ్ ఉమేర్‌ను కూడ అభినందించారు. జాతీయ స్థాయిలో ఉషూ పోటీల్లో పాల్గొనడానికి ఈ నెల 20న ఉత్తరాఖండ్ రాష్ట్రానికి బయల్దేరనున్న ఈ విద్యార్థికి అన్ని విధాల తమ సహాయ సహకారాలు ఉంటాయని ప్రిన్సిపల్ బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరేష్, కళాశాల ఇంచార్జ్ సందేష్ పాల్గొన్నారు.

వినాయకుల బావిలో నుండి చెత్త తీసివేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసిన వాటికి, వినాయక నిమజ్జనాలు చేసే సమయానికి వినాయక్ నగర్ ప్రాంతంలో గల వినాయక బావిలో గత సంవత్సరం చేసిన విగ్రహాల నిమజ్జనం చేయగా చెత్తను మున్సిపల్ శాఖ వారు తీస్తున్నారు. ఈసారి వినాయక నిమజ్జనం నాటికి వినాయకుల బావిలో గత సంవత్సరం వేసిన విగ్రహాలను, చెత్తను తీస్తున్నారు.

స్వరూపకు ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రస్థాయి పురస్కారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేసింది. ఇందులో భాగంగా శుక్రవారం రవీంద్రభారతిలో మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ నుండి రాష్ట్రవ్యాప్తంగా 12 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఉప ముఖ్యమంత్రి బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు . నిజామాబాద్ జిల్లా నుండి గురుకుల ధర్మారంలో పనిచేస్తున్న ఏ.స్వరూప పిజిటి ఇంగ్లీష్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానం పొందారు. ఈమె గత ఏడు సంవత్సరాల నుండి ఉత్తమ బోధనతోపాటు పిల్లలకు వినూత్న విధానంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ గేమ్స్, రోల్ ప్లే, స్కిట్స్, లుసిడా అండ్ కర్సు హ్యాండ్ రైటింగ్ రూపంలో ప్రవేట్ స్కూల్ కు దీటుగా పిల్లలకు ఉత్తమ బోధన చేసినందుకు రాష్ట్రస్థాయి పురస్కారం ఇచ్చారు. ఆమె భర్త కంచరి రవికుమార్ తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, నవీపేట్‌లో పిజిటి కామర్స్‌గా పనిచేస్తున్నారు.



కంఠేశ్వర్: మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందజేత

నిజామాబాద్‌రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని వరుణ్ నెక్సా సంస్థ వారు నిజామాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించారు. వరుణ్ నెక్సా సంస్థ ఆహ్వానం మేరకు జిల్లా విద్యశాఖ అధికారి దుర్గా ప్రసాద్, చేతుల మీదుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకేశ్వర్‌లో తెలుగు పండితులుగా పనిచేస్తున్న శ్రీ సాయిలు టేకూర్ల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అనంతరం సాయిలు మాట్లాడుతూ ఉత్తమ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది ఉత్తమ సమాజాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. ఉత్తమ సమాజాన్ని నిర్మించేది, సమాజంలో ఉత్తమ విలువలను పెంపొందించేది గురువులేనని టీఆర్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రవీణ్ మాట్లాడారు.



నిజామాబాద్‌రూరల్‌లో..

వర్షానికి కూలిన ఇల్లు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన కట్ట మహేష్ నివాస గృహం ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. సమాచారం అందుకున్న రెవిన్యూ అధికారులు శుక్రవారం కూలిన ఇంటిని పరిశీలించారు. ఇంటిని పరిశీలించి ఆస్తినష్టం వివరాలను వెల్లడించారు. ఇల్లు పాక్షికంగా దెబ్బతిందని అంచనా వేశారు. ఆస్తినష్టం దాదాపు రూ.30 వేల వరకు వాటిల్లిందని తహశీల్దార్ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ డి.రవి, ఏఆర్ఐ రాఘవేంద్రరావు, సిబ్బంది ఉన్నారు.

అంక్సాపూర్ ఉన్నత పాఠశాలలో మట్టి గణపతుల వితరణ

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని జడ్పిహెచ్ఎస్ అంక్సాపూర్ పాఠశాల యందు మట్టితో తయారుచేసిన 105 గణపతి విగ్రహాలను వితరణ చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయురాలు ఆర్ మల్లీశ్వరి శుక్రవారం తెలిపారు. భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు పసుపుల రఘునాథ్ విద్యార్థుల సహాయంతో బంక మట్టి గణపతులు 105 తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ పిఒపితో తయారు చేయబడిన విగ్రహాలను చెరువులలో నిమజ్జనం చేయడం వల్ల కలుషితం కావడమే కాకుండా అది కరగడానికి ఎక్కువ సమయం పడుతుందని అన్నారు. అంతేకాకుండా ఆ విగ్రహాలకు పూసిన అతి సాంద్రత ఘన రంగులు నీటిలో గల జీవులకు సంకటంగా మారుతుందని తెలిపారు. దాని ద్వారా పశువులకు హానికలుగుతుందని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని తెలిపారు. కాబట్టి అందరూ తప్పనిసరిగా మట్టి గణపతులను పూజించాలని కోరారు. విద్యార్థులందరికీ కూడా మట్టి గణపతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రవిచంద్ర, సునీత, శ్రీదేవి, రాజేంద్ర ,దామోదర్ గౌడ్ కాంతయ్య, సదాశి వ్ దేవరాజ్, వినోద్, శ్రీలక్ష్మి, దేవ సుకన్య, యమున, జాన్సన్, వేణుగోపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలి

బాల్కొండకు చేరిన దళిత సమన్యాయం పాదయాత్ర

నవతెలంగాణ-బాల్కొండ/ముప్కాల్

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని కోరుతూ దళిత వికాస సమితి ఆధ్వర్యంలో చేపట్టి దళిత సమన్యాయం పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర శుక్రవారం బాల్కొండకు చేరింది. ఈ పాదయాత్ర అదిలాబాదులో ఈ నెల 1న ప్రారంభమైందని అక్టోబర్ 10 అలంపూర్‌లో ముగుస్తుందని తెలిపారు. ఈ పాదయాత్రకు బాల్కొండ గ్రామ దళిత నాయకుడు జంగం విజయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయడం ద్వారా దళిత కులాలన్నింటికీ సమన్యాయం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్దార్థ, ఉపాధ్యక్షులు చిట్ల గంగాధర్ పాల్గొన్నారు.



బాల్కొండ: మాట్లాడుతున్న నాయకులు

ముప్కాల్: 'దళిత వికాస సమితి' ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్ర ముప్కాల్ కు చేరుకుంది. ఈ సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలోని ఎస్సి సంఘ కులస్తులతో దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్దార్థ మాట్లాడారు. 'దళిత వికాస సమితి' ఎస్సి కులస్తుల కోసం రిజర్వేషన్ల మార్పు కోసం చేపడుతున్న కార్యక్రమాల సరళిని వివరిస్తూ యాత్ర చేపట్టామన్నారు. జిల్లాలోకి ప్రవేశించగానే రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్ల గంగాధర్ వారికి స్వాగతం పలికారు. ఎస్సి రిజర్వేషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న దానిలో 3శాతం మంది దళిత సంపన్నులకు మాత్రమే లాభం చేకూరుతుందని, నిరుపేద దళిత కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. బీసీ రిజర్వేషన్లలో 6 లక్షల పైన ఆదాయం ఉన్నవారికి క్రిమిలేయర్ విధానం అమలు పరుస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో దళిత వికాస సమితి సభ్యులు సాయి కుమార్, గంగారాం, శ్రీకాంత్, రమేష్, కార్తిక్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

9న మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 9న నిర్వహించే మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నాలు ధర్నాలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల తొమ్మిది నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తేవాలని చూస్తున్నా సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా పదివేల రూపాయల వేతనాన్ని అమలు చేయాలని, నిజామాబాద్ జిల్లాకు రావలసిన మూడు కోట్ల రూపాయల బకాయి బిల్లులు చెల్లించాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. వంటగ్యాస్, కోడిగుడ్లు, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని, మెనూ ప్రకారం ఒక విద్యార్థికి 25 రూపాయల స్లాబ్ రేటును అమలు చేయాలని తదితర డిమాండ్లతో పాత కలెక్టర్ కార్యాలయం దగ్గర గల ధర్నా చౌక్‌లో తెలంగాణ రాష్ట్ర మధ్యన భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, నాయకులు రాధా కుమార్, ఇమ్రాన్ అలీ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా

- ఉచిత వైద్యం అందిస్తున్న మనోరమ ఆసుపత్రి వైద్యుల

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోడ్డు ప్రమాదంలో కోమా స్టేజ్‌కి వెళ్లిన బాధితుడికి నిజామాబాద్ నగరంలోని మనోరమ ఆసుపత్రి వైద్యులు అండగా నిలిచి వైద్యం అందించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి పరిస్థితి బాగానే ఉందని కోలుకుంటున్నాడని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు స్పందిస్తే బాధితుడికి కొండంత బలం చేకూరి బాగుంటాడని నిజామాబాద్ మనోరమ హాస్పిటల్ న్యూరో సర్జన్ కట్ట నరసింహ తెలిపారు. నగరంలోని మనోరమ ఆసుపత్రి ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బాధితుని వివరాలను వెల్లడించారు. బిచ్కుంద మండలానికి చెందిన బసవరాజు చందూరు మండలంలోని బడాపహడ్ కు వెళ్లే ప్రాంతంలో జూన్ 14న యాక్సిడెంట్ అయింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మనోరమ ఆసుపత్రిలో అదేరోజు బసవరాజ్ మిత్రులు తీసుకువచ్చి అడ్మిట్ చేశారు. అప్పటినుండి సుమారు రెండు నెలల వరకు బిచ్కుంద గ్రామస్తులు, గ్రామ పెద్దలు, బసవరాజ్ స్నేహితులు ఎంతో కొంత సహాయం అందించారు.

సుమారు నెలకుపైగా అవుతున్న బసవరాజు వద్దకు ఎవరు రాకపోవడంతో తమ సొంత ఖర్చులతో టాబ్లెట్స్ ఇవ్వడం రక్త పరీక్షలు వంటివి ఆసుపత్రి వైద్యులే నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడం, ఆయన తమ్ముడు మానసిక రోగి కావడంతో చాలా ఇబ్బంది పడ్డాడు. బసవరాజుకు స్నేహితులు ఆర్థిక సహాయం అందించి మొదట్లో చికిత్స అందించారు. తర్వాత వారు కూడా రాకపోవడంతో నెలరోజులుగా ఆసుపత్రి యాజమాన్యమే ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. బసవరాజుకు చిన్న మెదడులో బ్లడ్ క్లాట్ కావడంతో కోమాలో ఉండగా చికిత్స అందివ్వడం ద్వారా చూడగలుగుతున్నాడు. బంధువులు ఎవరైనా పక్కన ఉండి సపోర్ట్ చేస్తే త్వరలోనే కోలుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రి యాజమాన్యమే సుమారు 6 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది చేదోడువాదోడుగా ఉంటున్నారు. ప్రస్తుతం బసవరాజ్ కోలుకునే స్టేజ్‌కి రావడంతో గ్రామ పెద్దలు ఎవరైనా వస్తే బాగుంటుందని ఆసుపత్రి సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మనోరమ ఆస్పత్రి పరిధిలోని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించామన్నారు. ఎవరైనా బాధితుడికి తోడుండి చూసుకుంటే బాగుపడతాడని ఆసుపత్రి వైద్యులు తెలుపుతున్నారు.



కమ్మర్‌పల్లి ఐటిఐలో వాక్ ఇన్ అడ్మిషన్లు

- అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి ప్రిన్సిపాల్ కోటిరెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కల్పన శిక్షణ శాఖ, ప్రభుత్వ ఐటిఐ కమ్మర్‌పల్లి(బషీరాబాద్) లో ఈనెల 11 నుండి 20 వరకు వాక్ ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కమ్మర్ పల్లి ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎం. కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ లో మొదటి రెండవ మూడవ ఫేజ్‌లలో అడ్మిషన్స్ జరిగిన తర్వాత వివిధ ట్రేడ్స్‌లో 111 సీట్లు మిగిలి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున నిజామాబాద్ జిల్లా ప్రాంత వాసులు, పదవ తరగతి పాసైన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నాల్గవ ఫేజ్ వాక్ ఇన్ అడ్మిషన్లలో మొదటి, రెండవ, మూడవ ఫేజ్ లలో అడ్మిషన్స్ పొందినవారు అనర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు 14 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని, అడ్మిషన్లకు వయోపరిమితులు లేదని తెలిపారు. ఆన్ లైన్‌లో అప్లై చేసుకున్న వారికి ఈ నెల 11 నుండి 20వ వరకు ప్రతిరోజు బషీరాబాద్ లోని ఐటిఐ లో అడ్మిషన్స్ జరుగుతాయని తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు ఆన్ లైన్ అప్లికేషన్, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలని సూచించారు. అభ్యర్థులు తమకు నచ్చిన వివిధ ట్రేడ్స్ సీటు పొందాలని ఆయన కోరారు. కోర్సుల వివరాలు, విద్యార్హతలకు %ఝఝ.ఱ్‌ఱ.వశ్రీఖఅస్త్రుఱఖ. ప్రశీఙ.క్ష్మఅ% లో చూడాలని సూచించారు. వాక్ ఇన్ అడ్మిషన్స్ లో ఎటువంటి రిజర్వేషన్లు ఉండవని, పదవ తరగతి జీపీఏ మెరిట్ ప్రకారం సీట్లు అలాట్మెంట్ జరుగుతుందని పేర్కొన్నారు.

విజయ్‌లో మట్టి వినాయకుల ప్రదర్శన

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

సెప్టెంబర్ 7 (శనివారం) వినయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక విజయ్ హైస్కూల్లోని 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయినిలు రేఖ, స్రవంతి ఆధ్వర్యంలో మట్టితో వివిధ ఆకృతులలో గణనాథులను తయారు చేసి శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'మట్టి గణపతులను పూజించండి- పర్యావరణాన్ని కాపాడండి' అనే నినాదంతో ప్రజలు మట్టి గణపతులను మాత్రమే పూజించి, ప్రకృతిని కాపాడాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

కొవ్వొత్తులతో నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని అశోక ఎవెన్యూ అపార్ట్మెంట్ నివాసులు కల్‌కత్తా డాక్టర్‌కు మద్దతుగా సంఘీభావం తెలియజేస్తూ గత రాత్రి విద్యుత్ లైట్లను ఆపివేసి క్యాండిల్‌ను వెలిగించారు. డాక్టర్ మరణానికి కారకులైన వారిని, అత్యాచారానికి పాల్పడిన వారిపై తగిన చర్య తీసుకోవాలని అపార్ట్‌మెంట్ వాసులు కోరారు. డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఇంద్రాక్షి, అశోకా ఎవెన్యూ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి కోటేశ్వరరావు, రమణ గుప్త, కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో డా.శ్రీధర్ రావు, డా.జగన్ కుమార్, డా.స్వాతి మంచాల,డా.ఇందు కుషి, డా.ఇండిరాక్షి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శనివారం | సెప్టెంబర్ 07, 2024 | www.navatelangana.com

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వన మహోత్సవం


పోషణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎడపల్లి మండలం దుబ్బ తండా గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ వన మహోత్సవ కార్యక్రమాన్ని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శారద నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహిళలు, గర్భిణీలు కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాల బాలికలు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల కళాశాలల యూనియన్ అధ్యక్షునికి ఘన సన్మానం


సన్మానం పొందిన పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండల ప్రయివేటు పాఠశాలల కళాశాలల యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికైన ముస్త్యాల హరికృష్ణను వంశీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. 2020-2021 బ్యాచ్‌కు చెందిన హరికృష్ణకు ఆయన స్నేహితులు పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించారు. అలాగే ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వసుంధర, రూప, మీనా, శంకర్, రవి, ప్రవీణ్‌ను సన్మానించారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

- పలుచోట్ల మట్టి గణపతులు వితరణ

నవతెలంగాణ-విలేకరుల బృందం

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు కలుగుతుందని పలువురు అన్నారు. శుక్రవారం పలుచోట్ల మట్టి గణపతులు వితరణ చేశారు.

మట్టి గణపతులను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్..

కామారెడ్డి : మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్‌రెడ్డి మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పర్యావరణ కాలుష్యం కాకుండా కాలుష్య రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలనే తమ లక్ష్యానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. అందులో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించడం వల్ల కాలుష్యం నివారణకు పాటుపడవచ్చని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్లు అనూష, ప్రసన్న, రాణి, మహేష్, వనిత రామ్మోహన్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో (డీఎఫ్‌ఓ) జిల్లా ఫారెస్టు అధికారిణి నిఖిత బోగ, స్థానిక 47వ వార్డ్ కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో వార్డు ప్రజలకు మట్టి వినాయకులను, మొక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రసాయనాలతో తయారు చేసిన వినాయకులను పూజించొద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతి వినాయకులను వాడుతూ పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అవసరం మేరకు నీటిని పొదుపుగా వాడాలని కోరారు. కార్యక్రమంలో కామారెడ్డి (ఎఫ్‌ఆర్‌ఓ) ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి: పంపిణీ చేసిన మట్టి వినాయకులను చూపుతున్న పలువురు



లింగంపేట్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు అందజేత


సదాశివనగర్: సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో..

లింగంపేట్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ నరేష్, ఎంఈఓ రామస్వామి చేతుల మీదుగా మట్టి గణపతులను వితరణ చేసినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ మండలా ధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేందర్ మాట్లాడు తూ.. పర్యా వరణ సమతుల్యానికి మట్టి వినాయక విగ్రహాల తయారీ పర్యా వరణ పరిరక్షణకు దోహదప డుతుందని అన్నారు. మట్టి గణపతి ప్రతిమల ద్వారా నీరు, భూమి కలుషితం కాకుండా కాపాడుకోగలమని చిన్నతనంలోనే పిల్లలకు మట్టి గణపతులపైన అవగాహన కల్పిస్తే, రానున్న తరాలు రసాయన విగ్రహాలకు దూరంగా ఉంటాయనే ఉద్దేశంతో గత 14 సంవత్సరాలుగా యువ యూత్ ఆధ్వర్యంలో 1000 మట్టి వినాయకుల విగ్రహాలను ప్రతీ గడప గడపకూ వెళ్లి తమ వంతుగా ఉచితంగా పంపిణీ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, రెడ్ క్రాస్ సభ్యులు, రాజకుమార్, రజినీకాంత్, గంగాధర్, వినయ్, ప్రణయ్ ఉన్నారు.

సదాశివనగర్ : సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల మర్కల్ కామారెడ్డిలో గణేష్ ఉత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ బృందం తరుపున పర్యావరణ హిత గణేష్ విగ్రహాలు తయారు చేశారు. దీనిలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి మాట్లాడుతూ.. పర్యావరణ హిత గణేష్ విగ్రహాలు వాడటం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రకళ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

నవతెలంగాణ-పిట్లం

ఉచిత కంటి పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బిఎస్‌కే కంటి వైద్య నిపుణులు అర్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారం ఆరోగ్య ఉప కేంద్రంలోని పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నారం ఆరోగ్య ఉప కేంద్రంలోని ఆయా పాఠశాలలో గల 133 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా.. 9మంది విద్యార్థులకు కంటి సమస్యలున్నట్లు గుర్తించి వారికి మందులు అందజేసినట్టు తెలిపారు. కాగా ఒకరికి కంటి ఆపరేషన్ అవసరమున్నందున రెఫర్ చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మజ్మల్, హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్, సద్గుణ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో రక్తదానం



రక్తదానం చేస్తున ధాత్రిక లక్ష్మీపతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్న ఇట్టం రవీంద్రమోహన్ అనే పేషంట్‌కు ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో పేషంట్ కుటుంబ సభ్యులు చందాపురం రమేష్‌రెడ్డి సహకారంతో కామారెడ్డి జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులను సంప్రదించడంతో ఒక్క ఫోన్ కాల్‌తో వెంటనే స్పందించిన రాజంపేట్ మండల కేంద్రానికి చెందిన ధాత్రిక లక్ష్మీపతి ఒక ప్రాణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో వెంటనే వచ్చి రక్తం ఇచ్చినట్టు జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే మళ్లీ రక్తం వస్తుందని, కానీ రక్తం అందకపోయిన ప్రాణం తిరిగి రాదని తెలిపారు. మనం చేసే రక్తదానం వలన వెలకట్టలేని విలువైన ప్రాణం రక్షించబడుతుందన్నారు. యువత మానవత్వంతో స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణాలు కాపాడి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ సందర్భంగా ఒక్క ఫోన్ కాల్ చేయగానే వచ్చి రక్తదానం చేసిన లక్ష్మీపతికి జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధి రమేష్‌రెడ్డి, సతీష్, నరేందర్, ప్రవీణ్, పేషంట్ కుటుంబ సభ్యులు, కేబీఎస్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటరమణకు సన్మానం


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి రక్తదాతల సమూహ సలహాదారుడు గండి మాసానిపేట్‌లో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్ల ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నందుకు గాను కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు మాట్లాడుతూ.. 26 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా విధులను నిర్వర్తిస్తూ మరోక వైపు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచిన వెంకటరమణ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకోవడం ఉపాధ్యాయ లోకానికే గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా శాలువా, మెమెంటోతో సన్మానించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, జమీల్, సలహాదారులు ఎర్రం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా నగేష్


బాధ్యతలు స్వీకరిస్తున్న నగేష్

నవతెలంగాణ-బిచ్కుంద

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఉత్తర్వుల మేరకు బిచ్కుంద మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఎడి మైన్స్ అండ్ జ్యాలోజీ అధికారి నగేష్ బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లో ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక చవితి పండగ సందర్భంగా ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న మట్టి గణపతులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యేకంగా పారిశుధ్యం, శానిటేషన్, అమ్మ ఆదర్శ పాఠశాలలు పరిశీలన, హరితహారంలో భాగంగా ప్లాంటేషన్, ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న కాంపౌండ్స్ పనులను పరిశీలించి పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి పనులు వేకవంతంగా జరిగేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఎండిఓ గోపాలకృష్ణ, ఎంపీడీవో అంబాగౌడ్, అధికారులున్నారు.

వారం రోజుల్లో సదుపాయాలన్నీ ఏర్పాటు

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్


కళాశాలను సందర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారం రోజుల్లో సదుపాయాలన్నీ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించినట్టు తెలిపారు. కళాశాలలో ఫర్నీచర్ సమస్య, ఉపాధ్యాయుల సమస్య ఉండడంతో వాటిని పరిశీలించి పూర్తి వివరాలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుకు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. వారం రోజుల్లో కళాశాల సమస్యలన్నీ తీరుస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య, మైనార్టీ అధ్యక్షులు ఇమామ్ నరసింహారెడ్డి, సుధాకర్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరం

- జిల్లా ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కొరకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వివిధ చోట్ల సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్స్పెక్టర్లతో కలిసి సిరిసిల్ల రోడ్డు ఉన్న అయ్యప్పస్వామి గుడి, కమాన్ నుంచి వీక్లీ మార్కెట్, రామారెడ్డి ఎక్స్‌రోడ్డు, పొట్టి శ్రీరాములు విగ్రహం, ధర్మశాల, రైల్వేస్టేషన్ ఎక్స్‌రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్, అంబేద్కర్ విగ్రహం, నిజాంసాగర్ ఎక్స్‌రోడ్డు వరకు ప్రజల సహకారంతో సిరిసిల్ల రోడ్‌లో గల ఉన్న కొంతమంది, ప్రైవేట్ ఆసుపత్రి యజమాన్యాలు, వర్తక, వాణిజ్య, వ్యాపార సముదాయాల వారి సహకారంతో తిలక్ రోడ్, సుభాష్ రోడ్ ఉన్న మరికొందరి సహకారంతో జిల్లా కేంద్రంలో సుమారు 100 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఇవే కాకుండా మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నేను సైతంలో భాగంగా దాతలు ముందుకు రావాలని ఆమె పట్టణ ప్రజలను కోరారు. అశోకనగర్ ఎక్స్‌రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం, నిజాంసాగర్ ఎక్స్‌రోడ్డు, అంబేద్కర్ విగ్రహం, రైల్వేస్టేషన్, ధర్మశాల గంజి మార్కెట్, వీక్లీ మార్కెట్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల కవరేజీ విధంగా ప్రజలను అప్రమత్తంగా ఉంచుట కొరకు అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పిఏ సిస్టం (పబ్లిక్ అడ్రస్సింగ్)ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇందుకు సహకరించిన మధుసూదన్‌రెడ్డి, ఇతరులకు కామారెడ్డి జిల్లా పోలీస్‌శాఖ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కెమెరాలను కామారెడ్డి పోలీస్ స్టేషన్ నందు గల కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సింధు శర్మ

అలరించిన ఫుడ్ ఫెస్టివల్


వంటకాలను పరిశీలిస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హున్సా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నోరూరించే పలు రకాల వంటకాలు తయారు చేసి ప్రదర్శించారు. రుచికరమైన వంటకం చేసి అందరినీ ఆకర్షించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు నూతనంగా డిప్యూటేషన్‌పై వచ్చిన భౌతిక శాస్త్రం ఉపాధ్యాయురాలు, ఆంగ్ల ఉపాధ్యాయులకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బోధన్ శాసనసభ్యులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, డీఈఓ, ఎంఈఓకు గ్రామ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల చైర్మన్ రుక్మిణి, మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ, గ్రామపెద్దలు సమ్మె శంకర్, ఈరయ్యాప్ప మహారాజు, మర్కల్ శివకుమార్, నరేందర్, ప్రకాష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల,మోర్తాడ్,ముప్కాల్,మెండోరా మండలాల్లో వరుస దొంగతనాలకు పాల్పడిన చైన్ స్నాచర్ చవాన్ కిరణ్ సింగ్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు భీంగల్ సిఐ నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేయగా.. మెండోరా మండలం దూదిగాం గ్రామానికి చెందిన చైన్ స్నాచర్ చవాన్ కిరణ్ సింగ్ (21) అనుమానాస్పదంగా కనిపించడంతో నిందుతున్ని అదుపులోకి తీసుకున్నామని, అతని వద్ద మూడు బంగారు పుస్తెల తాడులు లభించాయని అన్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి నేరాలకు పాల్పడినట్టుగా ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుని వద్ద నుండి మూడు బంగారు పుస్తెల తాడులు, ఒక పల్సర్ బైక్, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టుతెలిపారు. నిందుతుడిని పట్టుకున్న ఏర్గట్ల ఎస్సై బి.రాము, కానిస్టేబుళ్లు వినయ్, శ్రీధర్, నవీన్ చంద్రలను భీంగల్ సిఐ ప్రశంసించారు.

ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారిగా రవీందర్

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండల ఇంచార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్, ఇటీవల కాలంలో ఎంక్లోస్ మెంట్ వల్ల రేంజ్ అధికారి వినాయక్ సస్పెండ్ విషయం విధితమే, అతని స్థానంలో రవీందర్ బాధ్యతలు తీసుకున్నారు. సిరికొండ రేంజ్ సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అటవీ రక్షణ, వన్యప్రాణుల వేట చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎంపీ, ఎమ్మెల్యే


అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎంపీ, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గ్రామ పెద్దలు గ్రామ అభివృద్ధి ప్రదాత బిజెపి పార్టీ సీనియర్ నాయకులు రమేష్ సెట్ తమ్మేవార్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా.. ఆయన అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార పాల్గొన్నారు. రమేష్‌సేట్ మృతదేహంపై పుష్పగుచ్చాలు పెట్టి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పిఆర్‌టియు టిజి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రజనీకాంత్ గౌడ్



నవతెలంగాణ-లింగంపేట్

పిఆర్‌టియు టిజి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లింగంపేట్ మండలానికి చెందిన రజినీకాంత్‌గౌడ్‌ను నియమించినట్టు పిఆర్‌టియు టిజి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, కుశాల్ తెలిపారు. మండలంలోని ఒంటరిపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎదురుగట్ల రజినీకాంత్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు కామారెడ్డి జిల్లా పిఆర్‌టియు టిజి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, కుషాల్ తెలియజేశారు. గతంలో రజనీకాంత్ గౌడ్ లింగంపేట్ మండల ప్రధాన కార్యదర్శిగా ఆరు సంవత్సరాలకుపైగా పనిచేసి ఆయన విశిష్ట సేవలను అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతూ హక్కుల సాధన కోసం ప్రధాన పాత్ర పోషించాడని తెలిపారు. అందుకు గుర్తింపుగా గురువారం రాష్ట్ర రాజధానిలోని రాష్ట్రస్థాయి సమావేశంలో కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు టిజి రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వంటల డెమో పరిశీలన


వంటల డెమోను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో హెడ్ కుక్ పోస్ట్‌కు 9 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారితో వంటల డెమోను తహసీల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు వంటలను శుక్రవారం పరిశీలించారు. ఇటీవల హెడ్‌కుక్ రిటర్మెంట్ కావడంతో ఆ స్థానంలో ఒకరిని నియమించడానికి ఈ డెమో నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, పాఠశాల ప్రత్యేక అధికారిని శ్యామల, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ మజారుద్దీన్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల రికార్డు అసిస్టెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి

నవతెలంగాణ-సిరికొండ

నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యానభ్యసినంచి ఉత్తమ పౌరులుగాలని, లక్ష్యంలేని చదువు గమ్యంలేని ప్రయాణంతో సమానమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. సత్యశోధక్ పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తించడం వలన భవిష్యత్తులో ఎంచుకునే లక్ష్యం పట్ల అవగాహనతో పాటు బాధ్యతయుతమైన వృత్తి నిబద్ధతను తెలుసుకుంటారన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా 56మంది విద్యార్థులు చాత్రోపాద్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఉత్తమ బోధన చేసిన ఉత్తమ విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులను ప్రధానం చేశారు.

ఉపాధ్యాయులకు, అంగన్వాడి టీచర్లకు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులను, అంగన్వాడీ టీచర్లను, ఆయాలను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు, అంగన్వాడీ టీచర్లకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను, అంగన్వాడీ టీచర్లను, శాలువాలు కప్పి సత్కరించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే సభ్యులను, అంగన్వాడీ ఆయాలను, పాఠశాల ఆయమ్మను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజేందర్, కోశాధికారి నరేష్, సభ్యులు మహేష్, కిష్టయ్య, సాతార రాజన్న, మాజీ సర్పంచ్ పుప్పాల గంగాధర్, ఆకుల రాజన్న, వెల్మల రాజేందర్, ప్రధానోపాధ్యాయులు నేలి శ్రీనివాస్, ఇంగ్లీష్ మీడియం కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

- విజయ్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సెప్టెంబర్-5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక విజయ్ హైస్కూల్లో గురుపూజోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా విశిష్ట సేవలందించిన సీనియర్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బంది కలిసి మార్చ్ ఫాస్ట్ చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 'అమ్మ లాలన', జోలపాటలతో మాతృత్వపు మాధుర్యాన్ని, ఆడబిడ్డలపై తండ్రికున్న ప్రేమ ఆపాయ్యతను, గురువు గొప్పతనాన్ని వివరిస్తూ... అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, ప్రిన్సిపాల్ పి.విజేత సారథ్యంలో హైస్కూల్ ఉపాధ్యాయినులు నృత్యంలో పాల్గొన్నారు. రైతు జై జవాన్, జై కిసాన్ అనే నినాదానికి స్ఫూర్తినిస్తూ... కరస్పాండెంట్ వి.ప్రభాదేవి నేతృత్వంలో 30 మంది ప్రైమరీ ఉపాధ్యాయునులు తమ నృత్యాన్ని ప్రదర్శించారు. కుటుంబ పోషణకు ఉద్యోగాలు చేస్తూ తనకంటు విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న మహిళల నృత్య రూపకాన్ని అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత నేతృత్వంలో ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయినులు ప్రదర్శించారు. ఇటీవలి కాలంలో మన దేశం సాధించిన ఘనతల్లో చంద్రయాన్-3. 'నాటు నాటు' పాట ఆస్కార్ అవార్డ్ గెలుచుకోవడం టి-20 వరల్డ్ కప్‌ను కెప్టెన్ రోహిత్ శర్మ సారథ్యం టీం ఇండియా సాధించిన ఘనతను ఉపాధ్యాయులు కళ్ళకు కట్టినట్లు వారి నృత్యం ద్వారా చూపించారు. వందేమాతర గీతంతో నృత్యాన్ని ముగించారు. కార్యక్రమంలో విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత మరియు ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్స్ సి.హెచ్.లలితాదేవి, ఎ. తారాచౌదరి, యస్. విజయ, సుకేశిని, జి. సునీత, కె. విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : విజయ్‌పాఠశాలలో ప్రదర్శన ఇస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం పొందిన ముద్దు కృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలెక్టరు రాజీవ్ గాంధీ హనుమంతును కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రయోగాల ద్వారా పాఠాలు బోధించడం వల్ల విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారు అని అన్నారు. కార్యక్రమంలో స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధర్మేంధర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా గౌరవసలహాదారు గంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సాయినగర్ కాలనీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయురాలు విశాలాక్షిని సన్మానించారు. అతిథులుగా ప్రజా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు ఉల్లెంగ నాగరాజు, వీణ రాణి, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- బ్లూ బర్డ్స్ పాఠశాల కరస్పాండెంట్ ఆవేసుద్దీన్

నవతెలంగాణ ఆర్మూర్

చిన్ననాటి నుండే విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు పట్టణంలోని జిరాయత్ నగర్‌లోని బ్లూ బర్డ్స్ పాఠశాల కరస్పాండెంట్ అవేసుద్దీన్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు సైతం అందజేసినట్టు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోషణపై అవగాహన

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని న్యాల్కల్ గ్రామంలో కులాస్‌పూర్ అంగన్వాడి సెంటర్‌లో పోషణ మాసం సందర్భంగా గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులు సరైన పోషకాలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ రజిత తెలిపారు. ఆకుకూరలు, మాంసకృత్తులు అత్యధికంగా తీసుకుంటు బాల అమృతం కూడా కచ్చితంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు వినోద, సవిత, సుప్రియ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండంలోని బాబాపూర్ గ్రామంలో ఎర్రోళ్ల సురేష్ కొడుకు 8 సంవత్సరాలు కొన్ని సంవత్సరాల క్రితం నుండి షుగర్, లివర్, హార్ట్ ప్రాబ్లంతో బాధపడుతున్నాడు. వారిది నిరుపేద కుటుంబం, కుటుంబ యజమాని ఎర్రోళ్ల సురేష్ గల్ఫ్‌కి వెళ్లి నష్ట పోయారు. వారికి విశ్వహిందూ పరిషత్ భీంగల్ శాఖ నుండి 20,100 సాయం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ భీంగల్ శాఖ రజనీకాంత్, లక్ష్మణ్ గౌడ్, దుర్గాప్రసాద్, ప్రమోద్ మనోజ్, నీలం సాదు తదితరులు సహాయాన్ని అందించారు.

రైతులకు పంట రుణం చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు రుణ మాఫీ అయిన సభ్యులకు తిరిగి రుణాల చెక్కులను చైర్మన్ బుర్రోళ్ల అశోక్ రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు.



చెక్కులు అందజేస్తున్న చైర్మన్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 48 మందికి రైతులకు రూ .42లక్షల 67వేలు, కొత్త సభ్యులు 22మంది రూ. 12లక్షల22వలే మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ చెక్కులు రైతులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సంఘ కార్యదర్శి బి. ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో కొనసాగుతున్న కోతుల వేట

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో గత వారం రోజులుగా కోతుల వేట ముమ్మరంగా కొనసాగుతుంది. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన వేటగాళ్ల బోనులను ఏర్పాటు చేసి కోతులను పట్టుకుంటున్నారు. శుక్రవారం స్థానిక శ్రీగిరి క్షేత్రంలోని బ్రహ్మంగారి గుడి వద్ద ఏర్పాటుచేసిన 20కి పైగా కోతులు పట్టుబడ్డాయి. ఇప్పటివరకు సుమారు వందకుపైగా కోతులను పట్టుకున్నట్లు కోతుల వేటగాళ్ల తెలిపారు. స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీతో వేటగాళ్ల పట్టుకునే ఒక్కో కోతికి రూ. 400 చెల్లించేలా ఒప్పందం చేసుకొని వాటిని పడుతున్నారు. గ్రామంలో ప్రజలను గాయపరుస్తూ, ఆస్తులకు, పంటలకు నష్టం కలిగిస్తున్న కోతుల బెడద తీర్చాలని గ్రామస్తుల కోరిక మేరకు కోతులను పట్టించేందుకు గ్రామ అభివృద్ధి కమిటీ ముందుకు వచ్చింది.బోనులో చిక్కిన కోతుల్ని సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టకుండా ఇచ్చోడ అటవీ ప్రాంతంలోని కోతుల సంరక్షణ కేంద్రానికి తరలించేలా చర్యలు చేపడుతున్నారు.

మహిళా ప్రయాణికులకు గిఫ్ట్‌లు అందజేత

- డీలక్స్ బస్సుల ప్రయాణించేవారికి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నుండి వరంగల్ రూట్ నందు నూతనంగా ప్రవేశ పెట్టిన డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ప్రవేశ పెట్టింది. ప్రతి 15 రోజులకు ఒకసారి గిఫ్ట్ బాక్సు నుండి డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులను అందజేశారు. ఇందులో భాగంగా 16.08.2024 నుండి 31.08.2024 మధ్య కాలంలో నిజామాబాద్ నుండి వరంగల్ రూట్లో ప్రయాణం చేసిన ముగ్గురు మహిళా ప్రయాణికులకు శుక్రవారం నిజామాబాద్ ప్రధాన బస్టాండు నందు సౌత్ ఇండియా షాపింగ్ మాల్, నిజామాబాద్ వారి అధ్వర్యంలో డ్రా ద్వారా విజేతలను ఎన్నుకున్నారు. 1.రవళిక, నిజామాబాదు, 2. సావిత్రి , నిజామాబాదు, 3. జ్యోతి, జగిత్యాల్ విజేతలుగా నిలిచారు. వారికి సౌత్ ఇండియా షాపింగ్ మాల్, నిజామాబాద్ వారి సౌజన్యంతో బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మన్ రావు, గోవర్ధన్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్, సత్యనారాయణ అసిస్టెంట్ మేనేజర్, స్టేషన్ మేనేజర్, ఉద్యోగులు పాల్గొన్నారు. కావునా మహిళా ప్రయాణికులు ఇట్టి డీలక్స్ బస్సులలో నిజామాబాద్ నుండి వరంగల్ రూట్ లలో ప్రయాణించి బహుమతులు పొందాలని తెలిపారు.



లక్కీడ్రా తీస్తున్న ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్, తదితరులు

ఉప్లూర్‌లో ఆరోగ్య శిబిరం

- 68 మందికి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ లో శుక్రవారం స్థానిక పాత గ్రామ పంచాయతీ భవనం వద్ద ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.శిబిరంలో ఏఎన్ఎం అరుణ కుమారి పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది 68మందికి డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా తదితర ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.ఈ సందర్భంగా ఏఎన్ఎం అరుణ కుమారి మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గుర అయ్యే అవకాశం ఉన్నందున ఈ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు వర్షాల మూలంగా, దోమల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తున్నందున ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పద్మ, ఆశా కార్యకర్తలు తిరుమల, శాంత, శారద, వినీల, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలకు ఉచిత విద్యుత్తు జీవో జారీపై ఎస్టీయూ హర్షం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యం మేరకు ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా రవీంద్ర భారతిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ పాఠశాలలకు, విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అమలు చేస్తూ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క జీవో విడుదల చేయడంపై ఎస్టీయూ జిల్లా జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. పాఠశాలలో సర్వీస్ పర్సన్ల నియామకానికి సంబంధించి నిధులు విడుదల చేయాలని, 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్కూల్ గ్రాంట్‌లు సత్వరం విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్మేందర్,శ్రీకాంత్‌లు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బహుళ జాతి సంస్థలలో గిరిరాజ్ విద్యార్థులకు ఉద్యోగాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్థానిక గిరిరాజ్ గవర్నమెంట్ కళాశాలలో టీఎస్ కేసి,దేశ్ పాండే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు జరిగిన నైపుణ్య శిక్షణలో పాల్గొన్న డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు వివిధ బహుళ జాతి సంస్థలలో ఉద్యోగాలు పొందారు. కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బహుళజాతి కంపెనీలైన కాగ్నిజెంట్, సాజిలిటీ, మేడికోడ్, హెచ్‌డీబీ ఫైనాన్స్‌లలో వివిధ స్థాయిలలో జరిగిన పరీక్షల్లో 14మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డా. పి.రామ్మోహన్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో టీఎస్ కేసీ సమన్వయకర్త డా. పి. రామకృష్ణ, మెంటార్ శ్రీకాంత్, దేశ్పాండే ఫౌండేషన్ శిక్షకులు అశోక్, అజీమ్, జాన్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ కోసం క్రీడా దుస్తుల వితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఈనెల 26, 27, 28 తేదీల్లో కమ్మర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే మండల టోర్నమెంట్ కోసం క్రీడా దుస్తులను వితరణ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు కొమ్ముల హరీష్ (ఆస్ట్రేలియా), డి. మహేష్ (సర్కిల్ ఇన్‌స్పెక్టర్), రవీందర్ రెడ్డి, రాజు (ఆత్మకూర్), రెడ్డీస్ యూత్ సభ్యులు, పదవ తరగతి 2000-01 బ్యాచ్ సభ్యులు అందరూ కలిసి రూ.40 వేల విలువ గల 80 జతల క్రీడ దుస్తులను అందజేశారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో దాతలు వితరణ చేసిన క్రీడా దుస్తులను మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. ఆంధ్రయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేష్, సీనియర్ ఉపాధ్యాయులు మధు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు నాగుల కమల, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ ట్రాకుల మంజూరు

- అర్బన్ ఎమ్మెల్యే వల్లే
- బిజెపి ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ ట్రాకుల మంజూరు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ఘనతేనని నిజామాబాద్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు అన్నారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇందూర్ జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులతో పాటు అర్జున అవార్డులు, బంగారు పతకాలు అందుకున్న నికత్ జరీన్, హుసాముద్దీన్ మహ్మద్, యెండల సౌందర్య, కె.ఆనంద్ వంటి అనేక క్రీడాకారులు అందించిన ఇందూరు జిల్లా నిరాదరణకు గురి అయిందని అన్నారు. ఇందూరు నగరంలోని ఆరు ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఉన్నే పాత కలెక్టరేట్ స్థలాన్ని ఆనుకుని ఉన్న గ్రౌండ్‌ను మినీ స్టేడియంగా నిర్మించాలన్నారు. అలాగేపాత ఇరిగేషన్ భవనం రెండు ఎకరాల స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని తెలిపారు. 30 సంవత్సరాల క్రితం 15 ఎకరాల్లో ఏర్పాటు చేసిన రాజారామ్ స్టేడియంలో ఇప్పటివరకు ఎటువంటి సౌకర్యాలు లేక నిరాదరణకు గురైన రాజారామ్ స్టేడియంను పూర్తిస్థాయి క్రికెట్ స్టేడియంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే డిమాండ్ చేశారన్నారు. పాత కలెక్టర్ గ్రౌండ్ స్థలాలు కబ్జాలకు గురి కాకుండా ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలని గతంలో ధర్నాలు చేశామన్నారు. ధన్‌పాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తన మేనిఫెస్టోలోనూ స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి, కోచ్‌ల నియామకాలకు కృషి చేస్తానని ప్రకటించారని తెలిపారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ వల్లే ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం ట్రాకుల నిర్మాణనికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందూర్ జిల్లాలో జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారని వారికీ సరైన సదుపాయలు, కోచ్‌లు లేరని ఎమ్మెల్యే తన లేఖల ద్వారా జిల్లా కలెక్టర్ మంత్రుల దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించిన కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందూర్ జిల్లాకు, రాష్ట్ర వ్యాప్తంగా స్పోర్ట్స్ స్టేడియంల నిర్మాణం అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. కోచ్ నియామకాలు జరుగుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కబ్జాలకు, కమిషన్లకు తెగపడి స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలన్నా స్థలంలో వాళ్ళ పార్టీ ఆఫీస్ నిర్మించాలని చూసిన దుర్మార్గులు కాంగ్రెస్ నాయకులన్నారు. స్పోర్ట్స్‌స్టేడియం నిర్మాణం కాంగ్రెస్ నాయకుల కృషే అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే కృషితో నిర్మాణం అయ్యే స్పోర్ట్స్ స్టేడియం, ట్రాకుల నిర్మాణం శంకుస్థాపన షబ్బీర్ అలీ చేస్తా అంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, మీసేవ శ్రీనివాస్, శీల శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్, నాయకులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వండి

- కృష్ణవేణి పాఠశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

ఇవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలని ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుళ్ల, విగ్నేష్, సుమతి అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్‌లో సైబర్ క్రైమ్ గురించి విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహమ్మద్ మినాజ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంలోనే విద్యుత్ సరఫరా పనులు

- పిన్ ఇన్సులేటర్ మార్చిన జేఎల్ఎం
- వందల గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా
- అభినందించిన ప్రజలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జక్రాన్‌పల్లి మండలంలో మిషన్ భగీరథ ఫీడర్ లైన్లో ఒక 33 కెవి పిన్ ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో స్థానిక జూనియర్ లైన్మెన్ రమేష్ వర్షంలో పిన్ ఇన్సులేటర్ మార్చి విద్యుత్ సరఫరా అందించారని మండల ట్రాన్స్కో ఏఇ ప్రసాద్ తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం లోని పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అందులో భాగముగా 33 కె.వి మిషన్ భగీరథ అర్గుల్ ఫీడర్ లైన్‌లో ఒక 33 కె.వి పిన్ ఇన్సులేటర్ ఫెయిల్ అయ్యింది. ఇన్సులేటర్ ఫెయిల్ అయిన లొకేషన్ చెరువులో ఉన్నది. కొన్ని వందల గ్రామాలకు మంచినీరు అందించే మిషన్ భగీరథ సబ్ స్టేషన్‌కు విద్యుత్ అందించాలనే సంకల్పంతో రమేష్ జేఎల్ఎం రిస్క్ తీసుకుని వాటర్‌లో వెళ్లి పిన్ ఇన్సులేటర్‌ను మార్చి విద్యుత్ సరఫరా చేసినట్లు మండల ఏఇ ప్రసాద్ తెలిపారు. జూనియర్ లైన్మెన్ సాహసానికి మెచ్చుకొని మండల ప్రజలు, విద్యుత్ అధికారులు రమేష్ జేఎల్ఎంని అభినందించారు.



రిపేర్ చేస్తున్న లైన్‌మెన్

రేషన్ కార్డులకు ఆధార్ అనుసంధానం

ఈ-కేవైసీకి సమయం పెంచండి



ర్యాలీగా వెళ్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రోజు,రోజు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయం నుండి ర్యాలీగా ధర్నా చౌక్ చేరుకొని ధర్నా నిర్వహించారు. సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రాష్ట్ర నాయకులు కె.భూమయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈనెల 30 వరకు రేషన్ కార్డులో ఆధార్ కార్డు అనుసంధానం చేస్తూ ఈ- కేవైసీ చేసుకోకపోతే రేషన్ కార్డులు రద్దు చేస్తామని తెలపడం అన్యాయమని అన్నారు. రేషన్ కార్డు ఉన్న కూలీలు, కార్మికులు గ్రామాల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లినందున ఈ- కేవైసీకి సమయం పెంచాలని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో వరద బీభత్సంవల్ల ప్రాణ నష్టం, ఇండ్లు, పండించిన పంటలు నష్టపోయినందున కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి నిధులను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, అడ్డికె రాజేశ్వర్, బి రఘురాం, పి నర్సింగ్ రావు, సాయిలు, అనిల్, రమేష్, అంజలి, కవిత, సాయికిరణ్, శీను తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతుల పంపిణీ



మట్టి గణపతి ప్రతిమలు అందజేస్తున్న చిదుర ప్రమోద్‌కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్/నిజామాబాద్

పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు తులసి పట్వారీ ఆధ్వర్యంలో పేర్కిట్ బోర్ర గణపతి ఆలయంలో మట్టి గణపతులు పంపిణి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పండితులు ప్రభాకర్ శర్మ గ్రామ అభివృద్ధి కమిటీ, ఆనంద్ ప్రింటర్స్ అధినేత ఆనంద్ ప్రముఖ బంజారా ఎలక్ట్రానిక్స్ అధినేత రజనీష్ కిరాడ్ కాలని వాసులు పాల్గొన్నారు.

నిజామాబాద్ :జిల్లా కేంద్రంలో నాందేవాడ చత్రపతి హనుమాన్ ఆలయం దగ్గర చిదుర బస్వాయ శ్రీనివాస్ ఫౌండేషన్ వారు శుక్రవారం మట్టిగణపతులను పంపిణీ చేశారు. పది సంవత్సరాల నుండి మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం 450 గణపతులను ఇచ్చామని చిదుర ప్రమోద్ కుమార్ తెలిపారు.

పోసానిపేట్‌లో వైద్య శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో పోసానిపేటలో రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సురేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క వ్యక్తిగత శుభ్రతతో పాటు చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జనార్ధన్, సిబ్బంది జార్జ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న పలువురు

వరద నీటికి కుళ్ళిపోయిన సోయా

నవతెలంగాణ-బోధన్

గత నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వరద నీరు హంగర్గ గ్రామ శివారులో చేరడంతో వందల ఎకరాలలో సోయా పంట నీట మునిగింది. బోధన్ మండలం హంగర్గ గ్రామ శివారులోని వందల ఎకరాలలో సోయా, పత్తి, వరి పంటలు నీట మునిగాయి. శ్యాంరావు అనే రైతుకు చెందిన 5 ఎకరాలలో వేసిన సోయా పంట పూర్తిగా కుళ్లిపోయింది. లక్ష 50 వేల పెట్టుబడి పెట్టి పంట వేస్తే రెండున్నర లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు తన ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



కుళ్ళిపోయిన సోయాను చూస్తున్న రైతు

ఉపాధ్యాయుల చేతిలో విద్యార్థుల భవిష్యత్తు



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

- తహసీల్దార్ నరేందర్
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని తహసీల్దార్ నరేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల లింగంపేట్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలలకు సంబంధించిన 17 మందిని మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా మండల విద్యాధికారి రామస్వామి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అనంతరం శాలువా కప్పి పూలదండ వేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ఎమ్మార్వో నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులను భావితరాలకు తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎంపీడీవో నరేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను గౌరవించుకోవడం తన బాధ్యత అని ఉపాధ్యాయులు అందరూ చక్కగా పనిచేసి మండలానికి మంచి పేరు తేవాలని తెలియజేశారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన షెట్పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వసుధకు మండల విద్యాధికారి రామస్వామి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామస్వామి, ప్రధానోపాధ్యాయులు సౌకత్ అలీ, రజినీకాంత్‌గౌడ్, పర్వయ్య, సురేష్ వివిధ సంఘాల బాధ్యులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

- బాన్సువాడ డి.ఎస్.పి సత్యనారాయణ

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

పండుగలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బాన్సువాడ డి.ఎస్.పి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం బాన్సువాడ డిఎస్పి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా పండుగలు జరుపుకోవడం మన సంప్రదాయమన్నారు. వినాయకుని మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ అనుమతి తీసుకుంటే భద్రత కల్పించడం సులువు అవుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఏదైనా సమస్య వస్తే తక్షణమే డయల్ 100 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గ్రామాల్లో కొనసాగుతున్న హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో హెల్త్ క్యాంప్‌లు కొనసాగుతున్నాయని మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ తెలిపారు. శుక్రవారం చీనూర్, పోచారం గ్రామాలలో హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రెండు గ్రామాలలో 204 మందికి చికిత్స చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పోచారం మాజీ సర్పంచ్ విజిత శ్రీనివాసరెడ్డితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



హెల్త్‌క్యాంపును నిర్వహిస్తున్న దృశ్యం

బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గత నాలుగు రోజులుగా భారీ వర్షంతో నష్టపోయిన వరద బాధితులకు నసురుల్లాబాద్ మండల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శుక్రవారం సహాయం అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 35 మందికి టార్పాలిన్లు, కవర్లు, హైజానిక్ కిట్లు, దుప్పట్లు, వంట సామగ్రిలను వరద బాధితులకు వారు అందజేశారు. దరిద్ర్యరేఖ దిగువన ఉన్న పేదలందరికీ, బాధితులకు తమ వంతు సహాయం సహకారం అందిస్తుందని రెడ్‌క్రాస్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, గిర్ధవర్ హన్మండ్లు, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి కుమ్మరి నారాయణ, ఉపాధ్యక్షులు మహాదేవ్ విఠల్, జిల్లా ఈసీ మెంబర్ షేక్ ఇక్బాల్, మారుతి, అంబెం మోహన్, సక్రునాయక్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ ప్రత్యేకాధికారిగా చందర్

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలం ప్రత్యేక అధికారిగా చందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టినట్టు ఎంపిడిఓ సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ సురెందర్‌రెడ్డి, ఎపిఓ మధుచారి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కామారెడ్డి జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులు మాలోత్ మోహన్, బానోత్ సూర్య ప్రకాష్ బాలల హక్కులపై శుక్రవారం అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. దీనికి కారణం బాలల హక్కులపై అవగాహన లేకపోవడం, పిల్లలపై ఎవరైనా లైంగిక వేధింపులు పాల్పడితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో ఉచిత టోల్‌ఫ్రీ 1098 నెంబర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-పొతంగల్

పోతంగల్ గ్రామం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని కోటగిరి గ్రామంలో శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తగు చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

మట్టి గణపతులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవా ఆధ్వర్యంలో శుక్రవారం మాశెట్టి నర్సయ్య ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు అందరూ మట్టి గణపతులను పూజించాలని కోరారు. తాను ప్రతి సంవత్సరం ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం 200 గణపతులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

మట్టి ప్రతిమే.. మహాగణపతి

- మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మట్టి వినాయకుడి ప్రతిమ ఏర్పాటుతో పర్యావరణాన్ని కాపాడిన వాళ్లమవుతామంటున్నారు బీర్కూర్ మండల కేంద్రంలోని గడికింది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాలలో మట్టి వినాయకుని విగ్రహాలను అందంగా తయారు చేసి గ్రామస్తులకు అందజేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణిశ్రీ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ సహకారంతో మట్టి వినాయకుని విగ్రహాలను తయారు చేశారు. విద్యార్థులు అందజేస్తున్న మట్టి గణపతులను ఉపయోగిస్తున్న గ్రామస్తులు విద్యార్థులను అభినందిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములవుతున్నారు.

ఇప్పటి నుంచి ప్రతి సంవ త్సరం పాఠశాల ఆవరణలో విద్యార్థులంతా కలిసి వినాయకుని విగ్రహాలను తయారు చేసి ఇంటింటికీ వెళ్లి మట్టి విగ్రహాలను అందజేస్తున్నారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులను పూజిస్తా మంటూ గ్రామస్తులు సైతం సంతోషం వ్యక్తం చేస్తూ విగ్రహాలను తీసుకువెళ్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం చేస్తున్న ఈ మహత్కార్యానికి గ్రామస్తులతోపాటు తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్మద,రాజు, రజిత ఉన్నారు.



మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు



ఆదర్శం.. దుబ్బతండా అంగన్వాడీ కేంద్రం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని దుబ్బతండా అంగన్వాడీ కేంద్రం ఆదర్శంగా నిలుస్తుంది. అంగన్వాడీ కేంద్రంలో నమోదైన బాలబాలికలకు అంగన్వాడీ టీచర్ శారదతో పాటు ఆయా లక్ష్మి సైతం సమయపాలన పాటిస్తూ చిన్నారి బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్య స్థాయి బోధన అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు చిన్నారుల ఎత్తు, బరువులను కొలుస్తున్నారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్ శారద చిన్నారి బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్య బోధన చేస్తున్నారు. వారికి అర్థమ య్యే విధంగా బాలబాలికలకు బోధిస్తున్నారు. దుబ్బ తండా అంగన్వాడీ కేంద్రంలోని ఉపాధ్యాయురాలు శారద సమయపాలన పాటిస్తూ, బాల బాలికల తల్లిదండ్రుల, సంబంధిత శాఖ అధికారుల మన్నలను పొందుతున్నారు.



బాలామృతం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్



చిన్నారుల బరువు కొలుస్తూ..

'యు డైస్ ప్లస్'పై ఒక్కరోజు శిక్షణ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో యుడైస్ ప్లేస్ పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిజాంసాగర్ మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి దేవ్‌సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉన్న అన్ని పాఠశాలల సమాచారాన్ని స్వీకరించి జాతీయస్థాయిలో పొందుపరచనున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల వివరాలను, విద్యార్థుల వివరాలను, పాఠశాల సమగ్ర వివరాలను పొందుపరచాలని సూచించారు. యుడైస్ ప్లస్‌కు అనుగుణంగానే అభివృద్ధి కార్యక్రమాలు, సమగ్ర నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి అందించనున్నట్టు తెలిపారు. డైసు కార్యక్రమంలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రామచందర్, వెంకటరామిరెడ్డి, మధుసూదనరాజు, సిఆర్పిలు బి.శ్రీధర్‌కుమార్, పి.నర్సింలు, వెంకట్రామాగౌడ్, శంకర్‌గౌడ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణనిస్తున్న ఎంఈవో

టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్ నియామకంతో సంబురాలు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

టీపీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకం కావడంతో నసురుల్లాబాద్ మండల కేంద్రంలో మాజీ మార్కెట్ కమిటీ కాంగ్రెస్ నేత పెరక శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. బాన్సువాడ నియోజకవర్గంలో వివిధ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. గతంలో మహేష్ కుమార్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నేతగా పార్టీలో ఆరంగేట్రం చేశారు. ఈయన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ఆయనకు పిసిసి పదవి రావడంతో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రతాప్‌సింగ్ ఇక్బాల్, చంచు నారాయణ, గంగారాం, భూమయ్య, పవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలి



నవతెలంగాణ-బోధన్

వినాయకచవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని బోధన్ తహసీల్దార్ విఠల్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, లయన్స్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో ఆయన ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనాలతో తయారు చేసిన మట్టి గణపతులు పర్యావరణానికి హాని కలిగిస్తాయని, కనుక నీరు కలుషితమై జీవరాశులకు ప్రమాదం కలుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని అన్నారు. అనంతరం బోధన్ మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ జిల్లా ప్రతినిధి లక్ష్మి, ఏఎంసి చైర్మన్ అంకు సంధ్యరాము, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, ఐఆర్ చక్రవర్తి, సాంబిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ యూనిట్‌కు స్థలసేకరణ ప్రతిపాదనలు



ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలో సోలార్ యూనిట్‌కు ప్రభుత్వ స్థల సేకరణకు ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా డిఆర్‌డిఓ పిడి సురేందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గద్దె గుండు తండా పరిధిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన గల ప్రభుత్వ కాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి సహజ సంపదను పెంపొందించుటకు గాను కేంద్ర ప్రభుత్వం సన్నహాలు చేస్తున్న తరుణంలో మండల కేంద్రంలో సోలార్ యూనిట్ ఏర్పాటుకు గాను స్థల పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఏపిఎం శిరీష సీసీలు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు తహసీల్దార్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఏకచక్రేశ్వర శివాలయంలో శనివారం సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే వినాయక చవితి వేడుకలకు బోధన్ తహశీల్దార్ విఠల్‌ను సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు కౌన్సిలర్ చందు, బీర్కూర్ బుజ్జి, మహేష్, దేవిదాస్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయకచవితి ఉత్సవాలను 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున భక్తులు వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

శ్రీ కాలభైరవ స్వామి హుండీ లెక్కింపు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఈసన్నపల్లి రామారెడ్డిలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి హుండీ లెక్కింపును శుక్రవారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో లెక్కించారు. దాదాపు ఐదు నెలల నుండి స్వామివారి కానుకగా రూ.9,80,136 వచ్చినట్లు ఆలయ ఈవో ప్రభు రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, ధర్మకర్తలు, ప్రజలు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య గణేష్ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

నవతెలంగాణ-పిట్లం

మండల ఆర్య వైశ్య గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి నాడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని టౌన్ ప్రెసిడెంట్ గంగా ప్రవీణ్ కుమార్ ప్రవారము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య గణేష్ మండలి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన రెడ్డిపేట విద్యార్థిని

నవతెలంగాణ-రామారెడ్డి

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో మండలంలోని రెడ్డిపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బిందు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు జమ్ముకాశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ బృంద బిందుకు శాలువాతో సన్మానించి అభినందించారు.

మృతిచెందిన కుటుంబాలకు ఆదుకోవాలి

బీఆర్ఎస్ నేత షేక్ జుబేర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గత నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం కారణంగా మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాన్సువాడ మున్సిపల్ వైస్‌చైర్మన్, బీఆర్ఎస్ నేత షేక్ జుబేర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలోని నాచుపల్లి గ్రామంలో స్వాతి అనే విద్యార్థిని కుటుంబ సభ్యులను, బొప్పస్‌పల్లి గ్రామంలో కిమ్లా నాయక్ పిడుగుపాటుతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ధైర్యంగా ఉండాలంటూ ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ బీఆర్ఎస్ నేత షేక్ జుబేర్ మాట్లాడుతూ.. భారీ వర్షం కారణంగా ఆర్థికంగా, ప్రాణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వ పరంగా కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోచి గణేష్, సాయి, శంకర్, నర్సింహులుగౌడ్, సాయిలు, అంజయ్య, అఫ్రోజ్, అయ్యూబ్, లక్ష్మణ్, గంగారాం, భూమేష్, అశోక్, శివ, సూరి, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ గోడ కూలిపోయిందని, అది పునర్నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాల ఆస్తులను కాపాడుకోవడానికి జరిగిన ఉద్యమం గురించి చర్చించారు. కబ్జాకు గురైనప్పుడు విద్యార్థి సంఘాలు చేసిన పోరాటం వలనే ఈరోజు అటానమస్ హెూదా వచ్చిందని షబ్బీర్ అలీ ప్రస్తావించారన్నారు. కూలిన ప్రహరీ గోడకు నిధులు విడుదల చేసి నిర్మించాలని అన్నారు. గోడ నిర్మాణం చేయలేకపోతే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతుందని, కళాశాల భూమిని కబ్జా చేసే ప్రయత్నం కూడా జరగవచ్చని తెలిపారు. వెంటనే గోడ నిర్మాణానికి బడ్జెట్ కేటాయించి నిర్మాణం చేపట్టాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.ఆజాద్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.